సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 5 । జూలై । 2024



వర్సిటీ బంద్ ఉద్రిక్తం

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నిందితులను శిక్షిం చాలని గురువారం చేపట్టిన తెలంగాణ యూనివర్సిటీ బంద్ ఉద్రిక్తంగా మారింది.

- 8లో ▸



కాపర్ తీగపై కన్ను

కాకతీయ కాలువ వెంబడి రైతులు ఏర్పాటు చేసుకున్న పంప్‌సెట్ల కాపర్ వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /26.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అందరి సహకారంతో అభివృద్ధి



నిజామాబాద్ రూరల్: అందరి సహకారంతో ఐదేళ్ల కాలంలో జిల్లా అభివృద్ధికి కృషి చేశానని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు అన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆయనను సిబ్బంది, పలువురు నాయకులు సన్మానించారు. విఠల్‌రావు మాట్లాడుతూ.. జెడ్పీ చైర్మన్‌గా ప్రజలకు సేవలందిచడంతో తన జన్మ ధన్యమైందన్నారు. తన హయాంలో జిల్లా పరిషత్‌కు పండిట్ దీన్‌దయాల్ జాతీయ అవార్డు వచ్చిందన్నారు. జెడ్పీ సీఈవో ఉష మాట్లాడుతూ.. జెడ్పీ చైర్మన్ అందరిని కలుపుకుపోయే మనిషి అన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్, రాజేశ్వర్, వి నర్సింగ్‌రావు, పృథ్వీరాజ్, తెలంగాణ శంకర్, శేఖర్‌రావు, మనోహర్‌రావు, మానికేశ్వర్‌రావు, మధుసూదన్‌రావు, ఉమామహేశ్వర్ రెడ్డి, వెల్మ సంఘం అధ్యక్షుడు కిశోర్ రావు, కేసీఆర్ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు రమణరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ లక్కీ డ్రా



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో నూతనంగా ప్రవేశ పెట్టిన డీలక్స్ బస్సులలో ప్రయాణించే మహిళలకు గిఫ్ట్ స్కీం ప్రవేశ పెట్టినట్లు ఆర్‌ఎం జానీరెడ్డి తెలిపారు. 15 రోజులకు ఒకసారి డ్రా తీసి విజేతలను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ బస్టాండ్‌లో ముగ్గురిని లక్కీ డ్రాలో ఎంపిక చేశారు. మొదటి బహుమతి మర్రి రూప(జగిత్యాల), రెండో బహుమతి అక్షిత(పెద్దపల్లి), మూడో బహుమతి జి సృజన(హుజురాబాద్) సాధించారు. విజేతలకు నిజామాబాద్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సౌజన్యంతో బహుమతులు అందజేస్తామని ఆర్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ సిబ్బంది కె అశోక్ కుమార్, టి గోవర్ధన్, డిప్యూటి రీజినల్ మేనేజర్ సరస్వతి, డిపో మేనేజర్ బియస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన



సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను తెరిపించి, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో జింకల సందడి



ఎకోటూరిజంకు ప్రణాళిక

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది. జలాశయం బ్యాక్‌వాటర్ ప్రాంతంలో పర్యాటకుల కోసం సౌకర్యాలు కల్పించే ప్రాజెక్టుకు అధికారులు రూపకల్పన చేస్తున్నారు. ఎకోటూరిజంతో పాటు బోటింగ్ ద్వారా బాసరలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయ సందర్శన సైతం టూరిజం ప్యాకేజీలో పెట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు.

- ఎస్సారెస్పీ నుంచి బాసరకు బోటింగ్ కోసం ఏర్పాట్లు
- ఎకోటూరిజం, సరస్వతి అమ్మవారి దర్శన ప్యాకేజీ సౌకర్యం!
- అటవీ అభివృద్ధి, పర్యాటక శాఖల ద్వారా ఏర్పాటుకు నిర్ణయం
- పర్యాటకంతో జిల్లాలో ఉపాధి అవకాశాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలోని అవకాశమున్న ప్రాంతాల్లో ఎకోటూరిజం సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని శ్రీరాంసాగర్ జలాశయం బ్యాక్‌వాటర్ ప్రాంతంలో సందడి చేసే జింకలు, నెమళ్లు, నక్కలు, కుందేళ్లు, విదేశీ వలస పక్షులను చూసేందుకు పర్యాటకుల కోసం తగిన సౌకర్యాలు కల్పించే ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు ఇప్పటికే విడతలవారీగా పరిశీలన చేస్తూ వస్తున్నారు.

■ బాల్కొండ, నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లోని జలాల్‌పూర్, ఉమ్మెడ, గాదేపల్లి, జీజీ నడ్కుడ గ్రామాల వద్ద బోటింగ్ పాయింట్, రెస్టారెంట్లు, రిసార్టులు, వ్యూ పాయింట్ల ఏర్పాటు కోసం స్థలాలను పరిశీలించారు. డ్రోన్ సర్వేకు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం 2023 జూలైలో 26 ఎకరాలు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.

■ పర్యాటలకు రాత్రి బస కోసం డొంకేశ్వర్ మండలం గాదేపల్లి వద్ద 18 ఎకరాలు, నందిపేట మండలం ఉమ్మెడ వద్ద గెస్ట్ హౌజ్‌ల కోసం 5 ఎకరాలు, బోటింగ్ పాయింట్ల కోసం బాల్కొండ మండలం జలాల్‌పూర్ వద్ద 3 ఎకరాలు కేటాయించేందుకు నిర్ణయించారు. దీనికోసం గతంలో అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు పరిశీలన చేశారు.

■ ఎకోటూరిజంతో పాటు బోటింగ్ ద్వారా బాసరలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయ సందర్శన సైతం టూరిజం ప్యాకేజీలో పెట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు. అయితే భూసేకరణ విషయంలో మాత్రం ఇప్పటివరకు ఒక స్పష్టత రాలేదు. ఇదిలా ఉండగా వన్యప్రాణులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, తమ ప్రాంతంలో పర్యాటక సొబగులను కాపాడుకునేందుకుగాను గ్రామస్తులకు తగిన అవగాహన కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఎస్ఆర్, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో..

టూరిజం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నిధుల సేకరణ విషయంలో ప్రత్యేకంగా ఆలోచనలు చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఈ సంస్థ ద్వారా కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా జంగిల్ లాడ్జెస్, జంగిల్ రిసార్ట్స్‌లను నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకుగాను అటవీ, పర్యాటక శాఖలకు సంబంధించి నిధులు అందించే పథకాలను సైతం పరిశీలిస్తున్నారు. మరోవైపు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా నిధులను ఖర్చు చేసేందుకు సైతం ప్రణాళికలు తయారు చేస్తున్నారు. మరో ఆప్షన్ కింద పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా నిధులు సమకూర్చుకుని పర్యాటక అభివృద్ధికి యోచన చేస్తున్నారు. జిల్లా ప్రజలు సైతం శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌లో ఎకోటూరిజం అభివృద్ధి చేయాలని బలంగా కోరుతున్నారు. చెప్పుకోదగిన అంశం ఏమిటంటే శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ఏరియాలోని గ్రామాల ప్రజలు తమతో సమానంగా జింకలు, నెమళ్లను, ఇతర వన్యప్రాణులను సంరక్షించుకునే విషయంలో ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ ఎవరైనా సరే వన్యప్రాణులను వేటాడే ఆలోచన చేసినప్పటికీ ఈ గ్రామాల ప్రజలు సహించరు. ఎకోటూరిజం అభివృద్ధి చెందితే తమ ప్రాంతానికి మరింత గుర్తింపు వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఆర్మూర్: ధరణి దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. ధరణి దరఖాస్తుల పరిశీలన, వాటి పరిష్కారం తీరుపై రెవెన్యూ అధికారులతో సమీక్ష జరిపారు. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, రికార్డుల ఆధారంగా దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అవసరమైతే అదనపు బృందాలను నియమించుకుని క్షేత్రస్థాయి విచారణ జరపాలని ఆదేశించారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా నివేదికను రూపొందించి ఆర్డీవో లాగిన్‌కు ఫార్వార్డ్ చేయాలన్నారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఉన్నారు.

జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్

నిజామాబాద్ రూరల్: జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పదవీ కాలం గురువారంతో ముగియగా.. జెడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. 2019 జూలై 5న దాదాన్నగారి విఠల్‌రావు జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టగా గురువారంతో ఆయన పదవీ కాలం ముగిసింది. ఇప్పటికే జిల్లాలోని మండలాలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది.

రైతుల అభిప్రాయం మేరకే రైతుభరోసా



ఎడపల్లిలో మాట్లాడుతున్న జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్‌రావు

ఎడపల్లి/బోధన్‌రూరల్: రైతుల అభిప్రాయం మేరకు ప్రభుత్వం రైతుభరోసా పథకం నిబంధనలు రూపొందిస్తుందని ఉమ్మడి జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం ఎడపల్లి మండలం జైతాపూర్, ఎడపల్లి, బోధన్ మండలం అమ్దాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సభలో ఆయన పాల్గొన్నారు. రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. రైతు భరోసా విధివిధానాల ఖరారు కోసం రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 89 ప్రాథమిక సహకార సంఘాలున్నాయని, గత నెల 29 నుంచి ప్రతీ సొసైటీ పరిధిలో రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని చెప్పారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. రైతులు మాట్లాడుతూ.. పది ఎకరాల్లోపు వారికే, పంటలు వేసే రైతులకే రైతు భరోసా ఇవ్వాలని కోరారు. పంట వేసే ముందే పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు కూడా ఇవ్వాలని కోరారు. ఈ సమావేశాల్లో ఎడపల్లి విండో చైర్మన్ మల్కారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, ఉపాధ్యక్షులు అనిల్‌రెడ్డి, జైతాపూర్ విండో చైర్మన్ కరుటూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఏవో సిద్ధిరామేశ్వర్, విండో కార్యదర్శులు సుభాస్, రాజారాం, డీసీసీబీ డైరెక్టర్, అమ్దాపూర్ సొసైటీ చైర్మన్ గిర్దావర్ గంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు గుర్తింపేదీ?

- నాడు తెలంగాణ కోసం పోరాటం.. నేడు దిక్కుతోచని స్థితిలో..
- ఉద్యమ కళాకారుడిగా డొంకేశ్వర్ వాసి సంజీవ్ కీలకపాత్ర
- ఓయూ పోరాటంలో జైలుకెళ్లిన నికాల్‌పూర్ వాసి సుమన్
- కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ఉద్యమ సమయంలో అప్పటి అర్బన్ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణతో పొగరి సంజీవ్

డొంకేశ్వర్(ఆర్మూర్): తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులకు గుర్తింపు కరువైంది. ఉద్యమ కళాకారులకు, జైలుకెళ్లిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొందరికే అవకాశం కల్పించింది. పోరాటంలో ముందువరుసలో నిలబడిన మరికొందరికి ఉద్యోగాలు దక్కలేదు. కనీసం ఆర్థిక సహాయం కూడా అందలేదు. చదువులు, జీవితాలను త్యాగం చేసి ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వ గుర్తింపు లేక ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇదే కోవలో డొంకేశ్వర్ మండలానికి చెందిన ఇద్దరు యువ ఉద్యమకారులు కూడా ఉన్నారు. అయితే అధికారంలో వస్తే ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని తెలంగాణ ఉద్యమకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జీవితాలను కోల్పోయిన తమకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

మలిదశ ఉద్యమం నుంచి కళాకారుడిగా..



ఈయన పేరు పొగరి సంజీవ్. డొంకేశ్వర్ గ్రామం. చిన్న వయసు నుంచే కళాకారుడిగా రాణిస్తున్నాడు. మలిదశ ఉద్యమం నుంచి 2014వరకు తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారుడిగా కీలక ప్రాత పోషించాడు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎక్కడ దూందాం జరిగినా తోటి కళాకారులతో కలిసి పాల్గొన్నాడు. తెలంగాణ గోస, సకలజనుల సమ్మె, వంటావార్పు, నిరాహార దీక్షల కార్యక్రమాలకు వెళ్లి పాటలతో ఉద్యమానికి తనవంతుగా ఊపిరి పోశాడు. అప్పట్లో ఎమ్మెల్యేగా రాజీనామా చేసిన యెండల లక్ష్మీనారాయణ, ఏనుగు రవీందర్‌రెడ్డి గెలుపు కోసం దూందాం కార్యక్రమాల్లో పాటలు పాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత కొంతమంది ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు లభించగా, సంజీవ్‌కు మాత్రం నిరాశే ఎదురైంది. బీకాం చదివిన తనకు ఉద్యోగం లేదా ఆర్థిక సాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని 2016లో సీఎం పేషీకి లేఖ రాశారు. జిల్లా అధికారులకు లేఖను సిఫార్సు చేసినా అది బుట్టదాఖలే అయ్యింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఓయూ ఉద్యమంలో జైలుకెళ్లి..



రాష్ట్ర సాధనలో ఓయూ విద్యార్థులు చేసిన పోరాటం ఎంతో కీలకమైనది. ఓయూ పోరాటంలో డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ యువకుడు బానోత్ సుమన్ సైతం పాలుపంచుకున్నాడు. 2009లో నిజాం కాలేజీలో బీఎస్సీ కంప్యూటర్స్ చేసిన సుమన్ ఓయూ విద్యార్థులతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నాడు. విద్యార్థి నాయకుడిగా ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. అసెంబ్లీ ముట్టడి, గన్‌పార్క్ వద్ద ధర్నాలు, దీక్షలు చేశారు. 2010లో లాఠీ దెబ్బలు తిని చంచల్‌గూడ జైలుకు కూడా వెళ్లాడు. సుమన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ఉద్యోగాలు రాకుండా పోయాయి. చదువును పూర్తి చేసుకుని ఉద్యోగానికి అర్హత లేక జీవితాన్నే కోల్పోయిన సుమన్ ప్రస్తుతం స్వగ్రామం నికాల్‌పూర్‌లో వ్యవసాయం చేసుకుంటున్నాడు.

అస్తవ్యస్తంగా ఎడపల్లి సెక్షన్

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ అధికారులు
- పెండింగ్‌లో వందల వర్క్ ఆర్డర్లు
- ఇటీవల విచారణ జరిపిన విద్యుత్ విజిలెన్స్ డీఈ





కాశీపురంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, సెక్షన్ ప్రాంతంలో అస్తవ్యస్తంగా పడేసిన ఏబీ స్విచ్‌లు

నిజామాబాద్ నాగారం/ఎడపల్లి: జిల్లా విద్యుత్ శాఖలో ఎడపల్లి సెక్షన్ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారులు సమస్యలు పరిష్కరించకుండా గాలికి వదిలేశారు. ఫలితంగా వందల్లో వర్క్ ఆర్డర్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయి. విలువైన ఏబీ స్విచ్‌లను ఎక్కడికక్కడ పడేశారు. మండలంలోని చాలా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు నిర్మించి వాటిపై పెట్టాల్సి ఉన్న ఇక్కడ పని చేసిన అధికారులు ఎవ్వరు కూడా పట్టించుకోలేదు. అధికారుల తీరుపై ఫిర్యాదులు రావడంతో ఇటీవల విద్యుత్ విజిలెన్స్ డీఈ ప్రభాకర్‌రావు ఎడపల్లి సెక్షన్‌కు సందర్శించి విచారణ చేపట్టారు.

వర్క్ ఆర్డర్ లేకుండానే..

మండలంలోని జానకంపేటలో జనతా రైస్‌మిల్లుకు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏడాది క్రితం యజమాని డీడీ కట్టారు. సదరు మండల సెక్షన్ ఏఈ వర్క్ ఆర్డర్ తీసుకోకుండానే స్తంభాలు వేసి మమా అనిపించేశారు. పనులు పూర్తి స్థాయిలో చేయలేదు. దీనిపై విద్యుత్ విజిలెన్స్ డీఈ ప్రభాకర్‌రావు విచారణ చేపట్టారు. కాగా ఇదే పనులపై ఇన్‌చార్జి ఏఈ రవిచంద్ర వర్క్‌ఆర్డర్ తీసుకున్నా.. ఆయన 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు.

పట్టింపు కరువు

ఎడపల్లి సెక్షన్‌లో పనులు చేయడానికి వందల్లో వర్క్‌ఆర్డర్‌లు తీసుకున్నారు. పనులు కొన్ని చేసినా, వర్క్ ఆర్డర్‌లు పూర్తి చేయలేదు. నిబంధనల ప్రకారం ఆర్డర్ తీసుకుంటే పనులు చేసిన వెంటనే ఆర్డర్ క్లోజ్ చేయాలి. పనులు చేసినా ఆర్డర్‌లు మాత్రం క్లోజ్ చేయలేదు. అధికారి బదిలీ అయితే వర్క్ ఆర్డర్‌లు క్లోజ్ చేసుకోవడానికి అనుమతి ఇస్తారు. మూడు నెలలు దాటినా వర్క్ ఆర్డర్‌లు క్లోజ్ చేయకపోవడం గమనార్హం. ఎడపల్లికి చెందిన సాయన్న ఇంటి ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేశారు. ఆ టవర్‌కు వెళ్లే విద్యుత్ తీగలు సాయన్న ఇంటి మీదుగా ప్రమాదకరంగా వెళ్తున్నాయి. విద్యుత్‌లైన్ సైడ్ ఆరమ్ వేయమని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోతున్నారు. సెల్ టవర్‌కు ఇప్పటికీ ఏబీ స్విచ్ ఏర్పాటు చేయలేదు. కాగా ఈ విషయాలపై వివరణ కోరేందుకు బోధన్ డీఈ ముక్తార్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

డీఈకి ఫిర్యాదు చేసినా..

సెల్ టవర్ మా ఇంటి ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయి. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈ విషయాన్ని ఏఈకి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. డీఈకి ఫిర్యాదు చేసినా అంతే ఉంది. - సాయన్న, వినియోగదారుడు

అంగన్‌వాడీలకు అద్దె కష్టాలు

- 10 నెలలుగా బకాయిలు
- టీచర్లపై ఒత్తిడి తెస్తున్న ఇంటి యజమానులు



నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నిజామాబాద్ నాగారం: అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె కష్టాలు పెరిగిపోతున్నాయి. పది నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అద్దె బకాయిలు పేరుకుపోయాయి. అద్దె చెల్లించాలని యజమానులు టీచర్లను ఒత్తిడి చేస్తున్నారు. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య జిల్లాలో చాలా అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రతి నెల అద్దె బిల్లుల రాకపోవడంతో టీచర్లు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి యజమానులతో చీవాట్లు తప్పడం లేదని వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 1500వరకు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో కొన్ని కేంద్రాలు కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో 605వరకు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటికి గ్రామాల్లో రూ.2వేల నుంచి రూ.3వేల వరకు అద్దె ఉంది. పట్టణాల్లో ప్రాంతాన్ని బట్టి రూ.3వేల నుంచి రూ. 6వేల వరకు అద్దె ఉంది. ఆయా గదులు సైతం ఇరుకుగా ఉండటంతో టీచర్లు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లులు రాక ఇబ్బందులెన్నో..

బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు అద్దెకు ఇవ్వడానికి యజమానులు ముందుకు రావడం లేదు. జిల్లాలో 2023 సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు అద్దె బకాయిలు రావాల్సి ఉంది. పది నెలల బకాయిలు రూ.కోటి వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అద్దె కోసం భవనాలు యజమానులు టీచర్లతో వాగ్వాదం చేస్తున్నారు. దీంతో వారి బాధ భరించలేక కొంతమంది టీచర్లు అప్పులు చేసి రెంట్ కడుతున్నారు.

నాలుగు నెలల బిల్లులు వచ్చాయి

అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవామే. రెండు రోజుల క్రితమే నాలుగు నెలల అద్దె బిల్లులు వచ్చాయి. రెండు, మూడు రోజుల్లో బిల్లుల చెల్లింపులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. త్వరలోనే మిగతా అద్దె క్లియర్ చేయడానికి ఉన్నతాధికారులకు విన్నవిస్తా.

- రసూల్‌బీ, జిల్లా సంక్షేమ శాఖాధికారి

క్లుప్తంగా

అధికారులు ప్రొటోకాల్ పాటించేలా ఆదేశాలు ఇవ్వండి

- స్పీకర్‌ను కోరిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. స్పీకర్‌ను గురువారం ఆయన హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. అధికార పార్టీ నేతలకే ప్రొటోకాల్ పాటిస్తున్నారని ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం ఇచ్చే తెలంగాణ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం



నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీని గురువారం ఢిల్లీలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని చెప్పామన్నారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆమెతో చర్చించినట్లు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు 'సాక్షి'కి తెలిపారు.

రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్‌కు 14 మంది ఎంపిక



కామారెడ్డి అర్బన్/భిక్కనూరు/మాచారెడ్డి: కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిడ్స్ అండర్-8, 10, 12 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికలకు భారీ స్పందన లభించింది. దాదాపు 280 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా వీరిలో అత్యంత ప్రతిభ చూపిన 14 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 7న హైదరాబాద్ గచ్చిబౌలి గోపిచంద్ అకాడమీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్‌లో వీరు పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. వివిధ అంశాల్లో పాల్గొన్న ప్రతిభావంతులకు సర్టిఫికెట్లను అందజేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే.. ఎ.రేహాన్ష్‌గౌడ్, ఎం.రాధ్య, జే.ఆద్యా, వై.శైలజ, ఎ.భార్గవ్‌రెడ్డి, ఎం.విరాట్, జి.మధుప్రియ, డి.విహాన్‌రెడ్డి, వై.సుమిత్ర, ఎం.శౌర్యచక్ర, డి.రాహుల్, సీహెచ్.స్పందన, సీహెచ్.నిహారిక, ఎం.పవిత్ర ఎంపికయ్యారు.

పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ టీకా

కామారెడ్డి టౌన్: ఈ నెల 6న జునోసిస్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డిలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ టీకాను ఉచితంగా వేయనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి గురువారం తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు టీకాలు వేయించాలని కోరారు.

కాపర్ తీగపై కన్ను

- కాకతీయ కాలువ వెంబడి పంపుసెట్ల వైర్లు చోరీ
- ఏటా ఇదే పరిస్థితి అని రైతుల ఆవేదన



కాపర్ వైర్ చోరీ అయిన పంపుసెట్లు

బాల్కొండ: వ్యవసాయ పంపుసెట్ల కాపర్‌పై దుండగులు కన్నేశారు. దీంతో కాకతీయ కాలువ వెంబడి రైతులు ఏర్పాటు చేసుకున్న పంపుసెట్ల వద్ద తరచూ చోరీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కాకతీయ కాలువ లీకేజీ నీటితో రైతులు పంపుసెట్ల ద్వారా ఆయకట్టుకు నీటిని సరఫరా చేసుకుంటున్నారు. మరోవైపు దుండగులు కాపర్‌వైర్‌ను చోరీ చేస్తుండడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముప్కాల్ మండలం రెంజర్ల, వెంచిర్యాల్ గ్రామ శివార్లలోని కాకతీయ కాలువ వెంబడి ఏర్పాటు చేసిన పంపుసెట్ల నుంచి బుధవారం రాత్రి దుండగులు కాపర్‌ను ఎత్తుకెళ్లారు. గతంలో పంపుసెట్లకు బిగించిన విద్యుత్ మోటార్లను సైతం ఎత్తుకెళ్లారు. మోటార్ నుంచి స్టార్టర్ వరకు ఉండే వైరును ఎక్కువగా కాపర్ ఉన్నదానినే ఏర్పాటు చేస్తారు. కాకతీయ కాలువలో దాదాపు అన్ని మోటార్లు నీటిలో ఉండేవి కావడంతో స్టార్టర్‌ను నుంచి మోటార్ వరకు కాలువ లోతు ఉన్నంత వరకు తీగ ఉంటుంది. దీంతో దొంగలు వాటిని టార్గెట్ చేసి చోరీకి పాల్పడుతున్నారు. గతంలో కాపర్, ఆయిల్ కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ మధ్య ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి కొంత బ్రేక్ పడగా బోరుబోమోటర్ల వద్ద చోరీలు జరుగుతున్నాయి.

పోలీసు అధికారులు పట్టించుకోవాలి..

కాకతీయ కాలువ పంపుసెట్ల వద్ద నుంచి ఏటా కాపర్ చోరీలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట భూముల వద్ద నుంచి ఊటబావుల మోటార్లను కూడా ఎత్తుకెళ్తున్నారు. గతరెండు నెలల క్రితం లక్ష్మీకాలువ ఆధారంగా ఏర్పాటు చేసిన రెండు మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లగా ఆ కేసులో ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. పోలీస్ ఉన్నత అధికారులు పట్టించుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. విత్తనాలు విత్తే సీజన్‌లో చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఉత్సాహంగా పర్యావరణ దినోత్సవ పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాల్లో జిల్లా స్థాయి పోటీలను కోటగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. 28 పాఠశాలల నుంచి మొత్తం 195 మంది విద్యార్థులతోపాటు వారి గైడ్ టీచర్లు హాజరయ్యారు. పొయెట్రీ విభాగంలో ఆర్ సాహితి (జెడ్పీహెచ్‌ఎస్, కంజర్) మొదటి స్థానం, టి శ్రీవల్లి (కేజీబీవీ,ఆర్మూర్) రెండోస్థానం, టి రాజశ్రీ, తృతీయ స్థానంలో నిలిచారు. పోస్టర్ మేకింగ్‌లో మొదటి స్థానంలో సత్యసంహిత(టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, ధర్మారం), రెండో స్థానంలో కే భవ్యశ్రీ (జెడ్పీహెచ్‌ఎస్, బోర్గాం-పి), మూడోస్థానంలో మహి (జెడ్పీహెచ్‌ఎస్,ముప్కాల్) నిలువగా వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, రాష్ట్ర ఎన్జీసీ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, స్థానిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బి మల్లేశం, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, క్వాలిటీ కోఆర్డినేటర్ జీవన్, ప్రజాసైన్స్ వేదిక ఉపాధ్యక్షుడు రామచందర్ గైక్వాడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలు

- రోడ్లపై ప్రవహిస్తున్న మురికినీరు
- శుభ్రం చేయడంలో కార్మికులకు ఇబ్బందులు



డ్రైనేజీని ఆక్రమించి కొనసాగుతున్న వ్యాపారం

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. దుకాణాల యజమానులు తమ దుకాణాల ముందున్న డ్రెయినేజీలపై నిర్మాణాలు చేపడుతుండటంతో కార్మికులు డ్రెయినేజీలు శుభ్రం చేయడానికి వీలులేకుండా పోయింది. దీంతో మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోంది. బాన్సువాడ మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. తాడ్కోల్ చౌరస్తా నుంచి మహేశ్వరి టాకీస్ వరకు డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. తాడ్కోల్ చౌరస్తా నుంచి టీచర్స్ కాలనీ రోడ్డు వరకు డ్రెయినేజీ సక్రమంగా నిర్మించకపోవడంతో వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో ఈ ప్రధాన రహదారి వెంట వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో డ్రెయినేజీని శుభ్రం చేయడానికి వీలులేకుండా ఉంది. అక్కడక్కడ ఉన్న మ్యాన్‌హోల్ లోపలికి వెళ్లి కార్మికులు డ్రైనేజీని శుభ్రం చేసే క్రమంలో ఊపిరి ఆడకుండా ఇబ్బందులు పడుతున్నారు. తాడ్కోల్ చౌరస్తా నుంచి బీసీ హాస్టల్ రోడ్డు వరకు ఇరువైపులా వ్యాపారులు డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రోడ్డుపైనే వ్యాపారులు చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది పలుమార్లు నోటీసులిచ్చినా బెదరడం లేదు. వ్యాపారులు మున్సిపాలిటీకి ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా చూపించాల్సిన అవసరముంది.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



సీఐతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై గురువారం సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాతతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రి ముందు బారికేడ్ల ఏర్పాటు వల్ల ఒకటే యూటర్న్ ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సీఐతో చర్చించారు. రెండు రోజుల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం చూపాలని సీఐని కోరారు. అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, సీఐ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మాజీ మేయర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



ఖలీల్‌వాడి: మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుమారుడు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌ని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. నగరంలోని ప్రగతినగర్‌లో ఉన్న డీఎస్ నివాసానికి ప్రశాంత్‌రెడ్డి గురువారం వెళ్లారు. డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డీఎస్ మృతికి మోదీ, రాహుల్ సంతాపం

ఖలీల్‌వాడి: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు. ఈ మేరకు గురువారం వేర్వేరుగా సంతాప సందేశాలను పంపించారు. డీఎస్ మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని మోదీ.. తన జీతమంతా ప్రజల కోసం, కాంగ్రెస్ కోసం పని చేశారని రాహుల్ పేర్కొన్నారు. డీఎస్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి రసూల్‌బీ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కనీస వైకల్యం 40శాతం లేదా అంతకు మించి ఉండి మెడికల్ సర్టిఫికెట్ (సదరం) కలిగి ఉండలని, ఆదాయ ధ్రువీకరణపత్రం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 2,894 క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 238 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1060.80 అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

హాకీ నేషనల్స్‌కు ఎంపిక



అక్షయ



శ్రీజ



రాజశ్రీ



నితిన్, మనోజ్

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు నేషనల్ లెవల్ హాకీకి ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి గురువారం తెలిపారు. గత నెల 23న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహించిన రెండో హాకీ ఇండియా జూనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్ జోన్ పోటీల్లో జిల్లాకు చెందిన అక్షయ, శ్రీజ, రాజశ్రీ, నితిన్, మనోజ్ ఉత్తమ ప్రతిభకనబర్చారన్నారు. కడపలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు టోర్నమెంట్‌లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని, శుక్రవారం హైదరాబాద్ నుంచి కడపకు బయల్దేరుతారని తెలిపారు. జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్, వైస్ ప్రెసిడెంట్ టి విద్యాసాగర్ రెడ్డి, రిటైర్డ్ హాకీ కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అంజు, సంయుక్త కార్యదర్శులు ఎండీ జావిద్, ఎండీ ఆరిఫ్, చిన్నయ్య, ఈసీ మెంబర్లు, సీనియర్ హాకీ క్రీడాకారులు నాగేశ్, సంతోష్ ఠాకూర్, సుధీర్, కత్తి శీను, నవనీత్, జిమ్మి రవి క్రీడాకారులను అభినందించారు.

వర్సిటీ బంద్ ఉద్రిక్తం



వర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

తెయూ(డిచ్‌పల్లి): నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నిందితులను శిక్షించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం చేపట్టిన తెలంగాణ యూనివర్సిటీ బంద్ ఉద్రిక్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నీట్ విద్యార్థులకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీ తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఎన్‌టీఏను వెంటనే రద్దు చేసి సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ చేయించి, 24 లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి పోలీసులు వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోకి ప్రవేశించి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. వారు మొరాయించడంతో ఈడ్చుకుంటూ తీసుకెళ్లి జీపులో బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కర్క గణేశ్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు దినేశ్, నాయకులు అక్షయ్, రాజేందర్, చిత్రు, శివకుమార్, రాజేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వానరాల గుంపులు



పెద్దవాగు రోడ్డుపై గుండెవాగు వంతెన వద్ద కోతుల గుంపు

బాల్కొండ: వనాల్లో ఉండాల్సిన కోతులు జనాల్లోకి వస్తున్నాయి. రోడ్లపై గుంపులుగుంపులుగా తిష్టవేస్తుండడంతో ప్రయాణికులు జంకుతున్నారు. జాతీయ రహదారిని కూడా కోతులు వదలడం లేదు. ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులో గుండెవాగు వంతెన వద్ద పెద్దవాగు రోడ్డుపైకి ప్రతిరోజూ కోతులు గుంపులుగుంపులుగా చేరుతున్నాయి. గుండెవాగు పరీవాహక ప్రాంతం అనువుగా ఉండడంతో పెద్ద సంఖ్యలో కోతులు సంచరిస్తున్నాయి. ఆ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. వ్యవసాయ భూముల్లోకి కోతులు మందలుగా చేరుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మక్క పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. మక్క పంట బుట్ట దశకు చేరుకోగా కోతులు పంటను నాశనం చేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు వంతుల వారీగా పంటపొలాల వద్ద కాపలా ఉంటున్నారు.

మహీంద్ర థార్ వాహనం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్

డిచ్‌పల్లి: మండలంలోని బర్దీపూర్ శివారులోని మహీంద్ర షోరూం స్టాక్ యార్డ్ నుంచి 'థార్' వాహనాన్ని ఎత్తుకెళ్లిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కే మల్లేశ్ తెలిపారు. గురువారం కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గత నెల 19న రాత్రి మహీంద్ర షోరూం స్టాక్‌యార్డ్ నుంచి కొత్త థార్ వాహనాన్ని దుండగులు ఎత్తుకెళ్లగా, షోరూం సీఈవో సాయినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి పర్యవేక్షణలో సీఐ మల్లేశ్ సిబ్బందితో మూడు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. గురువారం నవీపేట్‌కు చెందిన అబ్దుల్ సల్మాన్‌ఖాన్, ఆర్మూర్‌కు చెందిన వజాహత్ అలీ అలియాస్ వసిల్, అర్సపల్లికి చెందిన వాహెద్ ముగ్గురూ కలిసి మహీంద్రా షోరూం నుంచి దొంగిలించిన థార్ వాహనాన్ని అమ్మేందుకు అందులోనే నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరగా, నడిపల్లి శివారులో సీఐ మల్లేశ్ తన బృందంతో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి థార్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన దర్యాప్తు బృందాన్ని సీపీతోపాటు ఏసీపీ అభినందించారు.

భిక్కనూరు ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని వినతి



కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: భిక్కనూరు ఎంపీడీవోపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు గురువారం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీడీవో కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధి, షబ్బీర్‌అలీల ఫొటోలు పెట్టారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. భిక్కనూరు, కామారెడ్డి మండలాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సురేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని కొట్టాల్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట మండలం ఎక్కపల్లికి చెందిన బాలమోల సురేశ్(30) గ్రామం నుంచి ఎల్లారెడ్డికి బైక్‌పై వస్తుండగా.. సూర్యప్రకాశ్(28), అనోఖ్(27) ఎల్లారెడ్డి నుంచి లింగంపేట మండలం భవానిపేట వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈక్రమంలో రెండు బైక్‌లు కొట్టాల్ శివారులో ఢీకొన్నాయి. ఈ ఘటనలో సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన ఇద్దరిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సూర్యప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో..



పరమేశ్వర్ (ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి గ్రామ శివారులోని వ్యవసాయభూమిలో విద్యుత్ షాక్‌తో గౌరారం గ్రామానికి చెందిన ఓడిగె పరమేశ్వర్(38) మృతి చెందాడు. గురువారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తూ జీవించే పరమేశ్వర్ గ్రామశివారులో పని చేస్తుండగా 11కేవీ హ్యాండిల్ తగిలి మృతి చెందాడు. పరమేశ్వర్ మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని, బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని నల్లవెల్లి, గౌరారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.


పాముకాటుతో మహిళ ..



గంగామణి(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లారకు చెందిన ఔటి గంగామణి (44) పాముకాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి పాముకాటువేయడంతో గంగామణిని కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిందన్నారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారని, భర్త ఏడాది క్రితం గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. గంగామణి మృతితో పిల్లలు అనాథలయ్యారని గ్రామస్తులు అన్నారు.

చికిత్స పొందుతూ..



షరీఫ్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పడకల్‌కు చెందిన మహ్మద్ షరీఫ్(52) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షరీఫ్ గత నెల 26వ తేదీన పెట్రోల్ బంక్‌కు వెళ్లి నడుచుంటూ ఇంటికి తిరిగివస్తుండగా కలిగోట్ నుంచి జక్రాన్‌పల్లి వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో షరీఫ్ తలకు బలమైన గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. ఐదు రోజులపాటు ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. గురువారం ఉదయం షరీఫ్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

మల్లారం అటవీప్రాంతంలో..

వర్ని: మండలంలోని మల్లారం అటవీ ప్రాంతంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో మహ్మదాబాద్‌కు చెందిన పంచాల నరేందర్(30) మృతి చెందాడు. సాయిచరణ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తి కిరణ్‌కు సైతం గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో నిజామాబాద్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఆంధ్రనగర్‌లో పేకాటస్థావరంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం, సిబ్బంది గజేందర్, అనిల్, నర్సన్న పేకాటస్థావరంపై దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24,420 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నందిపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఇసుక లారీల పట్టివేత



పిట్లం(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను మండల కేంద్రం శివారులో పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. బిచ్కుంద మండలం హస్గుల్ శివారులోని మంజీరా వాగు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రెండు లారీలను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో బుధవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన ద్యాగ సుధాకర్ బుధవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లాడు. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు బీరువాలోని రూ.20వేల నగదుతోపాటు తులం బంగారు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సుధాకర్ తెలిపారు. అలాగే పక్కనే ఉన్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లో సైతం దుండగులు చోరీకి పాల్పడ్డారు.

గాంధారిలో.

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కనుకంటి కవిత ఇంట్లో బుధవారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.కనుకంటి కవిత బుధవారం తన ఇంటికి తాళం వేసి మండలంలోని ముదెల్లిలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తాళం పగుల గొట్టి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకున్న కవిత.. దుండగులు బీరువాను ధ్వంసం చేసి అందులో దాచి ఉంచిన బంగారం, వెండి నగలతోపాటు కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడలో నుంచి బంగారుగుండ్లు అపహరణ



బాధితురాలు సాయవ్వ

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ మెడలో నుంచి దుండగుడు బంగారు గుండ్లను లాక్కెళ్లారు. ఈ ఘటనపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జుక్కల్ మండలం పెద్దఏడ్గి గ్రామానికి చెందిన సాయవ్వ బిచ్కుందలోని బంధువుల ఇంటికి వచ్చింది. బుధవారం పెద్దఏడ్గికి తిరిగి వెళ్లేందుకు బస్టాండ్‌లో ఔరాద్ బస్సు ఎక్కుతుండగా వెనుక నుంచి వచ్చిన దుండగుడు అరతులం బంగారు గుండ్లను తెంపుకొని పారిపోయాడు. బాధితురాలు గురువారం కొడుకుతో కలిసి వచ్చిన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వారు సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.